క్లుప్తంగా

వేగవరంలో వేళంగిణి మాత ఉత్సవాలు



వేళంగిణి చర్చిలో ఉత్సవాలు

దెందులూరు: మండలంలోని వేగవరం గ్రామంలో ఆర్‌సీఎం చర్చిలో స్థానిక ఫారిస్ క్రిస్ట్ ఫాదర్ మోజెస్ అధ్యక్షతన వేళంగిణిమాత ఉత్సవాలు నవదిన పూజ చేశారు. వేగవరం, మసీదుపాడు, గోపన్నపాలెం, చల్లపల్లి సంఘస్తులకు ఫాదర్ ఆర్.బాలస్వామికి నిర్వాహకులు ఫాదర్ మోజెస్ కృతజ్ఞతలు తెలిపారు. తొలుత దివ్య పూజాబలి అర్పించారు. ఈ సందర్భంగా సంఘస్తులు ఫాదర్లను సత్కరించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి : రాట్నాలమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన మహిమ గల తల్లి శ్రీ రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టిక్కెట్ల ద్వారా రూ.43,760, విరాళాల ద్వారా రూ.25,007, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.34,840, ఫొటోల ద్వారా రూ.4,830 ఆదాయం లభించిందని దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లా ఈసీ మెంబర్ రాంబాబుకు సత్కారం



రాంబాబును సత్కరిస్తున్న నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఈసీ మెంబరు పోకల రాంబాబు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకాంక్షించారు. ఆదివారం దెందులూరులో ఆయన నివాసంలో రాంబాబును ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, కమ్ముల రవి ఘనంగా సత్కరించారు. పార్టీ మరింత అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావులు నియోజకవర్గంలో పార్టీ పెద్దలకు పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు ఆనంద్, ప్రకాష్, కార్యకర్తలు ఉన్నారు.

అవార్డు అందుకున్న శీతాల



ఏలూరులో అవార్డు అందుకుంటున్న శీతాల

ఉంగుటూరు: లయన్స్ జిల్లా కార్యాలయంలో (ఏలూరు) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దినోత్సవం సందర్భంగా కాగుపాడు ఉపాధ్యాయుడు శీతాల సత్యనారాయణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆదివారం ఏలూరులో ఆయనకు లయన్స్ గవర్నర్ గట్టి మాణిక్యాలరావు అవార్డును అందజేశారు. శాలువాకప్పి సత్కరించారు. లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ నేతల హర్షం

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తలారి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పోతునూరులో వారు మాట్లాడుతూ బీసీ వైఎస్సార్‌సీపీ నేతలు మేకా శేషుబాబు, నెరుసు నాగసత్యంలకు టీటీడీ బోర్డు మెంబర్లుగా నియమించి బీసీల పట్ల జగన్ తనకున్న ప్రాముఖ్యతను చాటుకున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవటం తథ్యమని తెలిపారు.

డ్రెయినేజీ పరిశీలన

ఏలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో కొల్లేరు గ్రామాలు 90 శాతం అభివృద్ధి సాధించాయని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం ఆయన పెదయాగనమిల్లిలో డ్రెయినేజీ అభివృద్ధి పనులు పరిశీలించారు. టీడీపీ హయాంలో కొల్లేరు గ్రామాల్లో మురుగునీరు బయటకు పోయేది కాదన్నారు. వర్షాలు, వరదలకు ఊళ్లన్నీ రోజుల తరబడి మురుగునీటిలో నిండిపోయేవని గుర్తుచేశారు. నేడు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో కొల్లేరు గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు దీన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో పనిచేసే ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- నాలుగేళ్లలో రూ.30 కోట్ల పనులు
- 80 శాతం సీసీ రోడ్డుగా అభివృద్ధి



శ్రీపర్రు గురుకులపేట మధ్య సీసీ రోడ్డుగా మారిన ప్రధానరోడ్డు



గుడివాకలంక బీసీ కాలనీలో సీసీ రోడ్డుగా మారిన గ్రావెల్ రోడ్డు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో రోడ్లకు మహర్దశ ఏర్పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధికి మండల పరిషత్, ఎంఎన్ఆర్ఈజీఎస్, రూర్బన్, ఎమ్మెల్యే స్పెషల్ ఫండ్స్, ఆర్అండ్‌బీ నుంచి రూ.30 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 35 కిలో మీటర్ల విస్తీర్ణంలో రోడ్లు నిర్మించారు. మట్టిరోడ్లను గ్రావెల్‌రోడ్లుగా, గ్రావెల్ రోడ్లను సీసీరోడ్లుగా అభివృద్ధి చేశారు.

రూ.20 కోట్ల ఉపాధి నిధులు

రోడ్ల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులు ఎంతో ఉపయోగపడ్డాయి. 15 గ్రామాల్లో 14 వేల మంది ఉపాధి కూలీలు చేస్తున్న పని దినాలు వల్ల మండల పరిషత్‌కు పెద్దఎత్తున మెటీరియల్ నిధులు వచ్చి చేరాయి. ఏడాదికి సుమారు రూ.9 కోట్ల చొప్పున నాలుగేళ్లలో రూ.34 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ చేరాయి. ఇందులో సుమారు రూ.20 కోట్లు సీసీరోడ్ల అభివృద్ధికి వెచ్చించారు. మాదేపల్లిలో రూ.2 కోట్లు, గుడివాకలంకలో రూ.80 లక్షలు, కోమటిలంకలో రూ.40 లక్షలు, మల్కాపురంలో రూ.60 లక్షలు, ప్రత్తికోళ్లలంకలో రూ.1.40 లక్షలు, పైడిచింతపాడు రూ.60 లక్షలతో పాటు పలు గ్రామాల్లో సుమారు 10 కిలో మీటర్ల సీసీ రోడ్లు అభివృద్ధి చేశారు. దీనికి తోడు ఆర్అండ్‌బీ శాఖ శ్రీపర్రు, మాదేపల్లి, కొక్కిరాయిలంక వద్ద ప్రధాన రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసింది.

రూర్బన్ నిధులతో కొత్త పనులు

ఏలూరు నగర పరిసర గ్రామాల్లో అర్బన్ స్థాయి మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన రూర్బన్ పథకం ఏలూరు మండల గ్రామాలకు కలిసి వచ్చింది. కొద్దిరోజుల క్రితం అధికారులు రూ.4 కోట్ల రూర్బన్ నిధులతో మరిన్ని సీసీ రోడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. టెండర్లు సైతం పిలిచి పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో ప్రత్తికోళ్లలంక గ్రామానికి రూ.22.12 లక్షలు, పైడిచింతపాడు రూ.17.99 లక్షలు, కోటేశ్వరదుర్గాపురం రూ.55.44 లక్షలు, గుడివాకలంక రూ.31.22 లక్షలు, మొండికోడు రూ.32.73 లక్షలు, చాటపర్రు రూ.75.04 లక్షలు, జాలిపూడి రూ.34.23 లక్షలు, మాదేపల్లి రూ.44.80, మల్కాపురం రూ.33. 25 లక్షలు, శ్రీపర్రు రూ.53.18 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో గ్రామాల్లో మరిన్ని సీసీ రోడ్లు అభివృద్ధి చేయనున్నారు.

ఉపాధి పనులతో అభివృద్ధి



ఉపాధి హామీ పథకం నిధులు గ్రామాల అభివృద్ధి పనులకు ఎంతో ఉపయోగపడ్డాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రత్యేక ప్రణాళికతో ఉపాధి పనులు నిర్వహించాం. దీనికితోడు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. ఫలితంగా పెద్ద ఎత్తున నిధులు వచ్చాయి. వీటితో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన గ్రామాలను అభివృద్ధి బాట పట్టించారు.

– ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు

మెటీరియల్ నిధులు రూ.57 లక్షలు



గతేడాది చేపట్టిన ఉపాధి పనులు కారణంగా నేటికీ రూ.57 లక్షల మెటీరియల్ పేమెంట్ అందుబాటులో ఉంది. ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. గతేడాది రూ.19 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఫలితం రాబట్టాం. 2023–24 సైతం రూ.37.90 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఇందులో కూలీలకు వేతనాల రూపంలో రూ.22.74 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.15.16 కోట్లు కేటాయించాం.

– కిషోర్, ఏపీఓ

దెందులూరులో రోడ్లు మంజూరు

దెందులూరు: దెందులూరు గౌడవీధిలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ రెండు రోడ్లు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. ఆదివారం దెందులూరు గౌడవీధిలోని కమ్యూనిటీ హాలులో ఆయన మాట్లాడుతూ గౌడవీధిలో గత కొన్నేళ్లుగా నడకకు తీవ్రంగా ఇబ్బందిగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పద్మశ్రీ ప్రసాద్‌లకు వైఎస్సార్‌సీపీ గౌడసంఘం దెందులూరు గ్రామం తరఫున ఏసుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

దెందులూరు: నేటి నుంచి 8వ తేదీ వరకు మండల స్థాయిలో, 12 నుంచి 16 వరకు నియోజకవర్గ స్థాయిలో అండర్–14, –17 విభాగాల్లో బాలబాలికలకు స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.కృష్ణారావు తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామని, పూర్తి వివరాలకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఫోన్ నెంబర్ 97011 77004లో సంప్రదించాలని కృష్ణారావు కోరారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

భీమడోలు: ఓ వివాహితను వేధిస్తోన్న ఓ వ్యక్తిపై పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. భీమడోలు మండలం దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెంకు చెందిన వివాహితను ఆమె ఇంటి ఎదురుగా ఉన్న పి. కొండ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు పేర్కొంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

భీమడోలు: గుండుగొలను గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.4550, రెండు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పెదవేగి : పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ.3,110 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు.

యువకుడికి గాయాలు

దెందులూరు: జాతీయ రహదారిపై గుండుగొలను ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వెళుతోన్న కారును వెనుక నుంచి వస్తున్న టూవీలర్ ఢీకొట్టింది. బైక్‌ను నడుపుతున్న ఏలూరు మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన బొమ్మాళి శంకర్ తలకు తీవ్రగాయమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై వైద్య చికిత్స నిమిత్తం శంకర్ ఏలూరు వైద్యశాలకు అంబులెన్స్‌లో తరలించారు.

పాదయాత్రా.. రౌడీయిజమా?

భీమడోలు: నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సమస్యలు తెలుసుకోవడానికా, రౌడీయిజం చేయడానికా అని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ ప్రశ్నించారు. భీమడోలులో ఆదివారం రాత్రి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిడమర్రు మండలం మందలపర్రులో లోకేశ్ పాదయాత్ర చేస్తూ యువగళం వలంటీర్లతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రార్థనలు ముగించుకుని ఇళ్లకు వెళుతున్న క్రైస్తవులపై టీడీపీ నాయకులతో కలిసి యువగళం వాలంటీర్లు కవ్వింపు చర్యలకు, దాడిని పాల్పడ్డారన్నారు. ఇదే నియోజకవర్గంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను తెలుసుకున్నారే తప్ప ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. అధికారంలోకి రాలేమన్న అక్కసుతో చంద్రబాబు, లోకేశ్‌లు పాదయాత్రలు చేస్తూ టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. పాదయాత్రలో టీడీపీ నాయకులపై నిఘా పెట్టి వారిని అదుపులోకి తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో టీడీపీ నిర్వహిస్తున్న పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని, ఇది జీర్ణించుకోలేక ఇలాంటి గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

దుగ్గిరాల, కొప్పాకలో ఉద్రిక్తత



కొప్పాక ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ భూస్వామి



దుగ్గిరాల్లో భూస్వామి వర్గీయులను అడ్డుకున్న పోలీసులు

- ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న పోలీసులు
- తనను విమర్శించే స్థాయి సతీష్‌కు లేదన్న భూస్వామి

పెదవేగి : వైఎస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణులు ఒకరిపై ఒకరు చేసుకొన్న విమర్శల నేపథ్యంలో ఆదివారం పెదవేగి మండలం దుగ్గిరాల, కొప్పాక గ్రామాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. యువగళం గన్నవరం సభలో టీడీపీ మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, దేవినేని ఉమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాట్లాడిన తీరును వారంరోజుల క్రితం కొప్పాకలో సొసైటీ చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు అలియాస్ భూస్వామి ఖండించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే అన్నయ్య చింతమనేని సతీష్ భూస్వామిని, ఆయన వ్యాపారాలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించారు. వీటిపై తేల్చుకునేందుకు దుగ్గిరాల గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌ను శాంతిభద్రతల నేపథ్యంలో పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికే అక్కడికి చేసుకున్న చింతమనేని సతీష్ వర్గాన్నీ చెదరగొట్టారు. ప్రెస్‌మీట్‌కు వచ్చేందుకు కొప్పాకను నుంచి 100 మంది కార్యకర్తలతో బయలుదేరిన భూస్వామిని మార్గమధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే భూస్వామి విలేకర్లతో మాట్లాడారు. సతీష్‌కు తనను విమర్శించే స్థాయి లేదని అన్నారు. సతీష్‌లా కోడిపందాలు, పేకాటలు, కార్ పార్కింగ్ పెట్టి చిల్లర వసూలు చేసుకోలేదని చెప్పారు. బొప్పన సుధ అనే నాయకుడు కూడా తనను మర్యాద లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. అతన్ని ఎప్పుడూ తాను ఒక్కమాట కూడా అనలేదని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, పర్వతనేని నాగయ్య, మోరవనేని భాస్కరరావు, పినకడిమి ఎంపీటీసీ గెడ్డం సుజాత, అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మడు, ఎంపీటీసీ రామకృష్ణ, దిమ్మిటి రమేష్, తాతయ్య, పరసా శివ, హరి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం



పోలసానిపల్లిలో పింఛన్ అందిస్తున్న సర్పంచ్ రహీమాబేగం హసేనా



శ్రీరామవరంలో కొత్త పెన్షన్లు అందిస్తున్న కామిరెడ్డి నాని

భీమడోలు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ఆదివారం దాదాపు పూర్తికావచ్చింది. ఈ నెలలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. భీమడోలు మండలంలో గతంలో 8,676 పింఛన్లు ఉండగా, కొత్తగా 186 పింఛన్లు మంజూరయ్యాయి. వృద్ధులు, వితంతులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు రూ.2,46,54000 ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటి వరకు 97 శాతానికి పైగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పోలసానిపల్లిలో నూతన పింఛన్లను సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా ఆధ్వర్యంలో ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్, వార్డు సభ్యులు, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అనంతమ్మ, కోట శ్రీనివాసరావు, మడికే అయ్యప్ప, వార్డు ఇన్‌చార్జి బొద్దాని ప్రసాద్, వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీ

దెందులూరు: కొత్తగా మంజూరైన పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శ్రీరామవరంలో లబ్ధిదారుడు బైగాని వెంకటేశ్వరరావుకు కొత్త పింఛన్ రూ.2750 నాని, గ్రామకమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు అందజేశారు. లబ్ధిదారులు తరఫున, మండలం తరఫున ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కామిరెడ్డి బాలు, మామిడి రాంబాబు, గ్రామ కార్యదర్శి శ్రీనివాసచౌదరి ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



పాతూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే



వాసుబాబును ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు గ్రామంలో శిథిలావస్థకు చేరిన శ్రీగంగానమ్మ తల్లి ఆలయాన్ని గ్రామస్తుల ఆర్థిక సాయంతో పునర్నిర్మించారు. ఆలయ ప్రతిష్ఠ వేడుక వేద మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగానమ్మ తల్లి చల్లని దీవెనలు ప్రజలపై మెండుగా ఉండాలని కోరారు. ఆలయ నిర్మాణ కమిటీని ఆయన అభినందించారు. ఆలయ కమిటీ వాసుబాబుకు ఘన స్వాగతం పలికారు. వాసుబాబును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెజ్జు బాలాజీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, నిర్మాణ కమిటీ నిర్వాహకులు సింగలూరి సుభాష్, వెజ్జు అన్నవరం, వెజ్జు నాగేశ్వరరావు, రౌతు రఘు, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

తండ్రి చెంతకు తప్పిపోయిన బాలుడు

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి చర్చికి వచ్చిన బాలుడు బయటకొచ్చి తప్పిపోయాడు. చర్చిలో సండేస్కూల్ జరుగుతుండగా ఆడుకుంటూ బయటకు వచ్చిన చిన్నారి రోడ్డుపైకి వచ్చి ఎటెళ్లాలో తెలియక తప్పిపోయాడు. ఒంటరిగా రోడ్డుపై తిరుగుతున్న బాలుడ్ని గుర్తించిన వినోద్‌కుమార్ అనే వ్యక్తి త్రీటౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీస్ అధికారులకు అప్పగించాడు. బాలుడు కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన డేవిడ్‌గా పోలీసులు గుర్తించారు. ఆగడాలలంకలో ఒక స్కూల్లో చదువుతున్నట్టు తెలుసుకున్నారు. సీఐ కోమాకుల శివాజీ బాలుడి తండ్రి అశోక్‌ను త్రీటౌన్ స్టేషన్‌కు పిలిపించి డేవిడ్‌ను అప్పగించారు. బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చిన వినోద్‌కుమార్‌ను పోలీసులు, డేవిడ్ తండ్రి అభినందించారు.

ఉపాధ్యాయులు భవిష్యత్తు సమాజ స్థాపకులు



వసంతను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

భీమడోలు: ఉపాధ్యాయులు భవిష్యత్తు సమాజ స్థాపకులని వక్తలు కొనియాడారు. జిల్లా లయన్స్ ఇంటర్నేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన భీమడోలు మండలం గుండుగొలను నెం.3 ప్రాథమిక పాఠశాల టీచర్ జమ్ములమడక వసంతను ఆదివారం సాయంత్రం ఏలూరులో జరిగిన ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఆమెకు దుశ్శాలువాను కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్‌పర్సన్ పంతగాని వెంకన్న మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసిన వసంత సేవలు మరవలేనివని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా, మండల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదవటం మాకిష్టం'



భీమడోలు శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న సుధాకర్



పెదవేగిలో చదవడం మాకిష్టంలో పాల్గొన్న విద్యార్థులు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయానికి ఇటీవల గ్రంథాలయ సంస్థ నుంచి వచ్చిన 12 నూతన పుస్తకాలను ప్రదర్శించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని సామూహిక పుస్తక పఠనం చేశారు. ఉంగరమా, పుస్తకమా అనే నీతి కథను వివరించారు. ప్రతిరోజు ఒక గంట సేపు గ్రంథాలయంలో చదువుకోవాలని గ్రంథపాలకులు కోరారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ గ్రంథాలయం విజ్ఞాన గని అని, పుస్తక విజ్ఞానం ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని అన్నారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, పాకిన సత్యనారాయణ, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో మేధాశక్తి పెంపు

పెదవేగి : నిత్యం గ్రంథ పఠనంతో విద్యార్థులకు మేధాశక్తి పెంపొందుతుందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథపాలకుడు విద్యార్థులతో ఉత్సాహంగా నిర్వహించారు. నిత్యం గ్రంథాలు చదవడం, యోగా, శరీరక వ్యాయామం, వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

వంతెన, కాలువరేవు నిర్మించిన వారికి సత్కారం

ఉంగుటూరు: కాగుపాడులో కాలిబాట వంతెన, కాలువరేవు నిర్మించిన సాదె రామ్మోహన్, గ్రామ సర్పంచ్ కడియాల సుదీష్ణ, జానకిరామ్‌లను గ్రామస్తులు చింతల కిషోర్, కాగుపాడు ఆర్సీఎం సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సుబ్బారావు, సొసైటీ చైర్మన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్టా వెంకట్రావు, దద్దనాల శివయ్య, గరబాబు నిత్యానందం, పెంటపాటి ఆనందరావు, యజ్జల శివ పాల్గొన్నారు.

8న ఆశా వర్కర్ల ఆందోళన

ఏలూరు (టూటౌన్): హర్యానా రాష్ట్రంలో ఆగస్టు 8 నుంచి ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఈనెల 5న ఆందోళన చేస్తామని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ తెలిపారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కమల అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో పోశమ్మ మాట్లాడారు. హర్యానాలో ఆశావర్కర్లు సమస్యల పరిష్కారం కోరుతూ గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ఆగస్టు 27న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులను లాఠీ చార్జీ చేసి అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలైన ఆశావర్కర్లు పట్ల హర్యానా పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన ఆశా వర్కర్లకు కనీసం మంచినీరు ఇవ్వకుండా టాయ్‌లెట్ సౌకర్యం కల్పించకుండా హింసించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా హర్యానా ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు రోజా, నాగమణి, కామేశ్వరి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com